

శ్రీరస్తు.. సౌభాగ్యమస్తు..!


నేడు వరలక్ష్మీ వ్రతం



దివ్యక్షేత్రం.. శ్రీమఠం

- ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న మంత్రాలయం
- నేటి నుంచి 354వ సప్తరాత్రోత్సవాలు ప్రారంభం
- 12న రాఘవేంద్రస్వామి మహారథోత్సవం
- ఉత్సవాలకు ముస్తాబు

6లో



యూరియా కొరత లేకుండా చేస్తాం

- త్వరలో జిల్లాకు పదివేల మెట్రిక్ టన్నులు
- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



వ్యవసాయశాఖ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా, ఎరువుల కొరత రానీయకుండా చూస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం బనగానపల్లెలో వ్యవసాయాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు అవసరమైన మేర యూరియాను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నంద్యాల జిల్లాలో యూరియా కొరత అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లానన్నారు. త్వరలో నంద్యాల జిల్లాకు 10వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతుందన్నారు. రైతులు అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురవడం, ప్రభుత్వ చొరవతో సాగునీరు ముం దుగా విడుదల కావడంతో అంచనాకు మించి జిల్లాలో పంటసాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. అపోహలతో పాటు యూరియా కృత్రిమ కొరత సృష్టించడంతో కొంతమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. రైతులు ముందుచూపుతో యూరియాను అదనంగా కొనుగోలు చేసి భద్రపరచడం సరికాదన్నారు. దీనివల్ల కొంత మంది రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మే, జూన్ నెలల్లో నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ డివిజన్‌లలో మొక్కజొన్న, మినుము, సోయాబీన్ సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 2లక్షల 38వేల 453 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,61,919 హెక్టార్లలో పంటలను సాగు చేశారన్నారు. గత ఏడాదితో పోలిస్తే 55వేల హెక్టార్లు పంటలను రైతులు అధికంగా సాగు చేశారన్నారు. వరి 75వేల హెక్టార్లలో వరి సాగు అవుతుందని అధికారులు అంచనా వేయగా 15వేల హెక్టార్లు అధికంగా ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. మొక్కజొన్న గత సంవత్సరం కంటే అధికంగా 20వేల హెక్టార్లలో అధికంగా సాగు చేశారన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, నంద్యాల ఏడీఏ ఆంజనేయులు, కోవెలకుంట్ల, సంజామల ఏవోలు సుధాకర్‌రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జగన్ జైలుకెళ్లడం ఖాయం

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి

డోన్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమ ఆదాయం కేసుల్లో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయమని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం డోన్‌కు వచ్చిన ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని శ్మశానంలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఎక్కడ పాదం పెడితే.. అక్కడ విధ్వంసాలు, అరాచకాలు, రౌడీయిజం తప్ప.. అభివృద్ధి ఉండదని ఎద్దేవా చేశారు. జగన్‌తో పాటు వైసీపీ నాయకులు ఎవరూ తప్పు చేసినా వారందరికీ శిక్ష తప్పదని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో చేసిన అక్రమాలు అవినీతి తవ్వేకొద్దీ బయటకు వస్తూనే ఉందన్నారు. జగన్‌కు ముఖ్యమంత్రి పదవి కోల్పోయి పిచ్చి పట్టిందని, ఏం మాత్రం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పరిశ్రమలు రాష్ట్రానికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారని, వారిని చూసి రాజకీయం నేర్చుకోవాలని వైఎస్ జగన్‌కు హితవు పలికారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయండి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి




మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి వెలుగు సిబ్బంది కృషిచేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆత్మకూరు వెలుగు కార్యాలయంలో ఆత్మకూరు, నందికొట్కూరు క్లస్టర్ల పరిధిలో సుమారు తొమ్మిది మండలాల వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు కార్యక్రమాలకు సంబంధించి గ్రామీణ స్థాయిలో ప్రణాళిక రూపొందించి అందుకు తగ్గట్లుగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేయబడిన రుణాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసి వారి ఆర్థిక ప్రమాణాలను మెరుగుపర్చేందుకు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీడీఎంయూ హనుమనాయక్, రంగారావు, ఏరియా కోర్డినేటర్ పుల్లయ్య, అంబమ్మ, ఏపీఎం కాశీశ్వరుడు, ఏజీఎం నాగప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

చిన్న భవనాలతో చింత

ప్రభుత్వాలు పేద విద్యార్థుల కష్టాలను గుర్తించి వసతిగృహాలు ఏర్పాటుచేశాయి. ఒక్కొక్క హాస్టల్‌లో 120 మంది విద్యార్థులు ఉండేందుకు వీలు కల్పించి దూరప్రాంతాల విద్యార్థులకు అండగా నిలుస్తున్నాయి. వారికి కావాల్సిన గదులు, మరుగుదొడ్లు, కొళాయిలు మౌలిక సదుపాయాల్లో కొరత లేకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయం. చాలా వరకు భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో గత్యంతర లేక అద్దెభవనాల్లో చాలీచాలని గదుల్లో విద్యార్థులకు వసతి ఏర్పాటు చేశారు. కనీస సౌకర్యాలు లేకుండా పిల్లలు తిప్పలు పడుతున్నారు.



- వసతిగృహాల్లో కనీస వసతులు కరువాయె
- అద్దెభవనాల్లో హాస్టళ్లు
- శిథిలావస్థల్లో భవనాలు
- విద్యార్థులకు తప్పని తిప్పలు

నంద్యాల రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పేదల విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ వసతిగృహాలు కొన్నిచోట్ల పూర్తి శిథిలావస్థకు చేరాయి. దీంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పెద్దపెద్ద భవనాలకు బాడుగలు కట్టలేక చిన్న భవనాలు తీసుకోవడంతో చాలీచాలని గదుల్లో, అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నికొన్ని భవనాల్లో 120 మంది విద్యార్థులకు స్థలం లేకపోవడంతో 70, 80 మందితో సరిపెట్టి సీట్లు లేవని చెబుతున్నారు. పేద విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నూతన భవనాలు నిర్మిస్తే ఈ సమస్యలుండవు. నంద్యాల జిల్లాలో బీసీ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతిగృహాలు 33 ఉన్నాయి. నంద్యాల డివిజన్ పరిధిలో 19, డోన్ డివిజన్ పరిధిలో 14 వసతిగృహాలున్నాయి. నంద్యాల డివిజన్ పరిధిలో 15 శాశ్వత, 4 అద్దె భవనాలున్నాయి((నంద్యాల 3, ఆళ్లగడ్డ 1). డోన్ డివిజన్ పరిధిలో 11 శాశ్వత, 3 అద్దె భవనాలున్నాయి3 (డోన్ 2, కోవెలకుంట్ల 1).



నూతన భవనాలు నిర్మిస్తే..

దేవనగర్‌లోని ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ బాలుర ప్రీమెట్రిక్ వసతిగృహం 2014-2015 విద్యాసంవత్సరం నుంచి పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. అప్పటి నుంచి వసతిగృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవన ప్రాంగణం దాదాపు 60 సెంట్లు ఉంది. ఇందులో నూతన భవనాలు నిర్మిస్తే దేవనగర్‌లోని ప్రీమెట్రిక్, కళాశాల విద్యార్థుల వసతిగృహాలు నిర్వహించవచ్చు. 2018-2019 విద్యా సంవత్సరంలో అప్పటి వార్డెన్ ప్రతిపాదనలు పెట్టారు. కానీ ఎలాంటి ప్రయోజనం లేదు.



నూతన భవన నిర్మాణానికి..

కలెక్టర్ ఆదేశాల మేరకు వసతిగృహ నూతన భవన నిర్మాణం కోసం బీసీ వెల్ఫేర్ సంచాలకులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రాసెస్ వెంటనే పూర్తై నూతన భవన నిర్మాణం జరిగేలా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి కోరుతున్నా. బీసీ వెల్ఫేర్ కళాశాల బాలుర వసతిగృహానికి రూ.35,000, ప్రీమెట్రిక్‌కు రూ.12,700 అద్దె కడుతున్నాం.

- వేణుగోపాల్, సంక్షేమాధికారి, బీసీ వెల్ఫేర్ కళాశాల బాలుర వసతిగృహం

రూ.8.50 కోట్లు అంచనా..

వసతిగృహాల నిర్మాణానికి దాదాపు రూ.8.50 కోట్ల అంచనా వేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న వసతిగృహ సంక్షేమాధికారి 2022లో ప్రపోజల్ పెట్టగా అప్పటి జగన్ ప్రభుత్వం మొదట సానుకూలంగా స్పందించలేదు. మళ్లీమళ్లీ ప్రపోజల్ పెట్టడంతో ఉన్నతాధికారులు అప్రూవల్ తీసుకొని ఆర్థికశాఖకు పంపాలనుకున్నారు. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో అప్రూవల్ రద్దైంది. ప్రస్తుతం నూతన భవన నిర్మాణానికి ప్రపోజల్ పెట్టగా కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

పదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..

- మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు
- అభినందించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్

ఆత్మకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరింది. ఈ కేసుకు సంబంధించి గురువారం ఆత్మకూరు అర్బన్ సీఐ రాము వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన రేషన్ డీలర్ వెంకటేశ్వర్లు కుమార్తె రమ్యశ్రీ. 2015లో పట్టణంలోని థెరిసా జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదివేది. ఇంటర్ ఫలితాల్లో మార్కులు తక్కువగా రావడంతో తల్లిదండ్రులు ఆమెను మందలించారు. మనస్తాపానికి గురైన రమ్యశ్రీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పట్లో ఆబాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మూడేళ్లపాటు ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కేసును క్లోజ్ చేశారు. ఇటీవల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పెండింగ్ మిస్సింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలోనే ఈ కేసు ప్రస్తావనకు రావడంతో మిస్సింగ్ కేసు రీఓపెన్ చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం బాలిక తల్లిదండ్రులు ఆళ్లగడ్డలో నివాసం ఉండటంతో తొలుత ఎలాంటి ఆధారాలు లభించలేదు. రమ్యశ్రీ చదివిన కళాశాలలో విచారించి ఆమె స్నేహితురాళ్ల వివరాలను సేకరించారు. దీంతో పోలీసులకు ఆధారాలు లభించాయి. ఇంటి నుంచి వెళ్లిపోయిన రమ్యశ్రీ మొదట హిందూపురంలోని ఓంశాంతి ఆశ్రమంలో కొంతకాలం ఉందని తెలిసింది. అనంతరం కర్ణాటకలోని చిక్కబల్లాపూర్ జిల్లా నగరిగిరి వద్ద గల ఓంశాంతి ఆశ్రమంలో ఉంటున్నట్లు గుర్తించారు. అక్కడికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరుకు తీసుకువచ్చి గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. పదేళ్ల తర్వాత తమ కుమార్తె రావడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సీఐ రామును ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఈ సందర్భంగా అభినందించారు.



రమ్యశ్రీని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అవుకుజలకళ

అవుకు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు. గత నెల 31న గాలేరు నగరి సుజల స్రవంతి కెనాల్ ద్వారా 11,500 క్యూసెక్కుల నీటిని రిజర్వాయర్‌కు విడుదల చేశారు. దీనికి తోడు ఎస్సార్బీసీ కాల్వ నుంచి 550 క్యూసెక్కుల నీరు, వర్షాలతో ఎర్రమల కొండల నుంచి భారీగా నీరు వచ్చి రిజర్వాయర్‌కు చేరుతుంది. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.5 టీఎంసీల నీటినిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి చెర్లోపల్లె సమీపంలోని జీఎన్ఎస్ఎస్ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కడప జిల్లాకు 12,300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఎస్సార్బీసీ హెడ్‌రెగ్యులేటర్ నుంచి 12ఏ బ్లాక్ (సంగపట్నం) ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు 350 క్యూసెక్కులు నీటిని ఆయకట్టుకు విడుదల చేయగా, లోకల్ ఆయకట్టుకు 60 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఆగస్టు నెల మొదటి వారంలోనే రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా చేరటంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వరి 10వేలు ఎకరాలు, మొక్కజొన్న 5వేలు ఎకరాలు, మిరప 2వేలు ఎకరాలు, కంది 800 ఎకరాలు, మినుము 210 ఎకరాలు సాగు అవుతుండగా మిగతా పొలంలో పసుపు, పత్తి, వేరుశనగ, హార్టికల్చర్ మొత్తం 20వేలు ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు.



నిండుకుండలా కనిపిస్తున్న అవుకు రిజర్వాయర్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

నంద్యాల కల్చరల్ (శ్రీశైలం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో నిత్య కళారాధనలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉషాశివ డాన్స్ అకాడమీచే సంప్రదాయ నృత్యప్రదర్శన నిర్వహించారు. నిత్య కళారాధనలో భాగంగా వినాయక కౌత్వం, శివతాండవం, నాగేంద్రహారాయ, భో శంభో, తదితర గీతాలకు కళాకారులకు నృత్య ప్రదర్శన చేశారు.

'సుంకేసుల'ను పరిశీలించిన నిపుణులు 6

దివ్యక్షేత్రం.. శ్రీమఠం

కష్టాలు, బాధలు జీవితంలో ఓ భాగమయ్యాయి. అవన్నీ దూరం కావాలంటే ఆధ్యాత్మిక స్వావలంబన అవసరం. పవిత్ర తుంగా తీరంలో ప్రశాంత వాతావరణంలో ఉన్న శ్రీమఠంలో ఆధ్యాత్మిక స్వావలంబన, మానసిక ప్రశాంతత దొరుకుతుంది. ఇక్కడ రాఘవేంద్రస్వామి మూల బృందావనం రూపంలో భక్తులకు దర్శనమిస్తూ కొలిచే భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి ఆశీస్సుల కోసం తరలివస్తున్నారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మూలరాములకు నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. స్వామివారి 354వ సప్తరాత్రోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 14 వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈ మేరకు శ్రీమఠం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

- మంత్రాలయం, (ఆంధ్రజ్యోతి)



- ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న మంత్రాలయం
- నేటి నుంచి 354వ సప్తరాత్రోత్సవాలు ప్రారంభం
- 12న రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం
- ఉత్సవాలకు ముస్తాబు



మూలరాములను భక్తులకు చూపుతున్న పీఠాధిపతి


14వ తేదీ వరకు సప్తరాత్రోత్సవాలు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ ఆరాధన మహోత్సవాలు(సప్తరాత్రోత్సవాలు) ఆగస్టు 8వ తేదీ నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఏడురోజుల పాటు జరిగే ఉత్సవాలు మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. 8న ధ్వజారోహణం, 9న రజిత మంటపోత్సవం, తెప్పోత్సవం, 10న పూర్వారాధన, 11న మధ్యారాధన, 12న ఉత్తర ఆరాధన వేడుకలు వైభవంగా జరుగుతాయి. 13న సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన, 14న సర్వసమర్పణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో ఏడురోజుల పాటు యోగీంద్ర కళామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఏడాది వారణాసికి చెందిన జయరాంశుక్లా, తమిళనాడులోని శ్రీరంగం పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త విట్టల్‌కు రాఘవేంద్రస్వామి ప్రశస్తి అవార్డులు అందజేయనున్నారు. ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని మఠం అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఉత్సవాల భద్రత నేపథ్యంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.ఎన్.భార్గవి, సీఐ రామాంజులు, ఎస్ శివాంజల్ ఆధ్వర్యంలో 350 మంది పోలీసులను తరలించారు.

1671లో బృందావన ప్రవేశం

క్రీ.శ.1671 శ్రావణ బహుళ విదియ గురువారం సూర్యోదయానికి ముందు మూల రాముడిని మనసారా పూజించి ముందుగా ఏర్పాటు చేసుకున్న సమాధి(బృందావనం)లోకి సజీవంగా వెళ్లారు. ఈ రోజును పురస్కరించుకొని మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆగస్టు నెలలో ఏడు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా మంత్రాలయం మఠం ప్రధాన కేంద్రంగా దాదాపు 1500లకు పైగా బృందావనాలు వెలిశాయి. భారతదేశంలో దాదాపు 24రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా బృందావనాలు వెలిసి అనునిత్యం పూజలు జరుగుతున్నాయి. విదేశాలైన సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో సైతం బృందావనాలు వెలిసి నిత్య పూజలు అందుకుంటున్నాయి.

రూ.3కోట్ల విరాళంతో నిర్మించిన పుష్కరిణి



రాఘవేంద్ర స్వామి జీవితచరిత్ర

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయుల పాలనలో తమిళనాడులోని భువనగిరిలో తిమ్మనబట్టు, గోపమ్మ అనే దంపతులకు క్రీ.శ.1595 సంవత్సరంలో మన్మథనామ సంవత్సరం పాల్గున శుద్ధ సప్తమి గురువారం రాఘవేంద్రుడు జన్మించారు. ఈయనకు తొలుత వెంకటనాథుడని తల్లిదండ్రులు నామకరణం చేశారు. ఐదేళ్ల వయస్సులో విద్యాభ్యాసం ప్రారంభించి నాలుగు వేద అధ్యాయాలను చదివి సాటిలేని పాండిత్యాన్ని సంపాదించారు. ఇదే క్రమంలో పరిమళ వాఖ్యానంలో గెలుపొంది పరిమళాచార్యులుగా, 18రోజులుగా జరిగిన గ్రంథ పరిశోధనలో ద్రావిడ సన్యాసిని ఓడించి మహాభాష్యా పండితాచార్యులుగా, ద్వైత్వ సిద్ధాంతాలపై గెలుపొంది బట్టాచార్యులుగా బిరుదులు సంపాదించారు.

1623లో సన్యాసం స్వీకరణ

వెంకటనాథుడికి రాత్రి శ్రీరామచంద్ర ప్రభువులు కలలో దర్శనమిచ్చి సన్యాసం తీసుకోమని ఆజ్ఞాపించారు. ఇందుకు అంగీకరించిన వెంకటనాథుడు ఒక రోజు రాత్రి భార్య పిల్లలను వదిలి తంజావూర్ రాజు రఘునాథుడి ఆధ్వర్యంలో 1623సంవత్సరం పాల్గున శుద్ధ విదియనాడు మద్వాపీఠ సంప్రదాయాన్ని అనుసరించి ప్రత్యేక సన్యాసం స్వీకరించారు. ఈ సన్యాసం తీసుకున్న రోజు నుంచి శ్రీరాఘవేంద్రతీర్థులుగా నామకరణం పొందారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం మహోత్సవం మంత్రాలయంలో ప్రతి ఏటా వైభవంగా జరుగుతుంది. స్వామివారి మహిమలు చూసి ఆదోని నవాబ్ సుద్దిమసూద్‌ఖాన్ ముగ్ధుడయ్యారు. రాఘవేంద్రస్వామి కోరిక మేరకు తన ఆధీనంలో ఉన్న తుంగభద్ర నదితీరాన మంచాల గ్రామాన్ని ఇచ్చి సత్కరించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గర్భిణులు, బాలింతలు, వికలాంగులు, వృద్ధులకు శీఘ్రదర్శన ఏర్పాట్లు చేశాం. పుష్కరిణి, బృందావనం గార్డెన్, కర్ణాటక బ్యాంక్‌ల వద్ద ఉచితంగా క్లాక్ రూం, లాకర్‌లు ఏర్పాటు చేసి భక్తులు బసచేసే సౌకర్యం కల్పించాం. ఉచిత వైద్యం, అంబులెన్స్, తాగునీరు, పరిమళ ప్రసాదం, క్యూలైన్లు, సర్వం సిద్ధం చేశాం. ఈఏడాది ప్రత్యేకంగా రూ.20లక్షల ఖర్చుతో క్యూలైన్లు, ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేశాం.



● సుబుదేంద్ర తీర్థులు, పీఠాధిపతి, శ్రీమఠం



మ్యూజియంలో ఏర్పాటు చేసిన పురాతన గ్రంథాలు



శ్రీరాముని దగ్గర రాఘవేంద్ర స్వామి పాలరాతి విగ్రహం



ఎల్లెల్సీలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

కౌతాళం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ క్షేత్రం రద్దీగా కనిపించింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల సంఖ్య అంతకంతకు పెరిగిపోవడంతో క్యూలైన్లు నిండిపోయాయి. దీంతో గంటల తరబడి దర్శనానికి సమయం పట్టింది. ఇదిలా ఉండగా శ్రావణ శుక్రవారం రోజున మహిళల కోసం ఉచితంగా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో విజయరాజు తెలిపారు. ఆలయంలో తూర్పు రాజగోపురం దగ్గర ఉదయం 9 గంటలకు వర మహాలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని తెలిపారు. ఆలయం తరపున మహిళలకు వాయనం ఇస్తామని తెలిపారు.

'సుంకేసుల'ను పరిశీలించిన నిపుణులు

- గేట్లు తనిఖీ..
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక

కర్నూలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీని సాగునీటి ప్రాజెక్టుల గేట్ల నిపుణులు, ప్రభుత్వ అసిస్టెంట్ అడ్వైజర్ (గేట్స్) కృష్ణారావు, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీవో)ఈఈ విజయసారథి, ఏఈఈలు పి.మల్లేశ్వరి, ప్రదీప్ బృందం గురువారం పరిశీలించారు. జిల్లా ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, కేసీ కెనాల్ సబ్ డివిజన్ డీఈఈ, హంద్రీనీవా ప్రాజెక్టు డివిజన్-1 ఈఈ ప్రసాద్‌రావు ఆ బృందం వెంట ఉన్నారు. సుంకేసుల బ్యారేజీ మొత్తం గేట్లు, కేసీ కాల్వ గేట్లు నిపుణులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. పలు గేట్ల లీకేజీలు గుర్తించారు. తుంగభద్ర-పెన్నా నదులను అనుసంధానం చేస్తూ 1863లో అప్పటి బ్రిటీష్ పాలకులు జలరవాణా కోసం తుంగభద్ర నదిపై బ్యారేజీ, కేసీ కాలువ తవ్వారు. 1933లో పూర్తిగా సాగునీటి కాలువగా మార్చారు. ఈ డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు, కేసీ కాలువకు 31.90 టీఎంసీలు నికర జలాలు కేటాయించారు. ఈ బ్యారేజీ నుంచి కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. 1993-94 మధ్య బ్యారేజీ ఆధునికీకరణకు అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రి ఎన్టీఆర్, చంద్రబాబు నిధులు ఇచ్చి పనుల్లో వేగం పెంచారు. 2004 నాటికి బ్యారేజీ పునఃనిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత వచ్చిన సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జాతికి అంకితం చేశారు. 25 సంవత్సరాలైంది.. 2009 నాటి వరదలకు బ్యారేజీ భారీగా దెబ్బతింది. అప్పటి ప్రభుత్వం శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించలేదు. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకం నిధులతో గేట్లు మరమ్మతులు చేశారు. అయినా నిర్వహణ సమస్యలు వెంటాడుతున్నాయి. ఇదిలా ఉండగా నిపుణుల కమిటీ త్వరలో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన తెలిపారు.



డ్యాం గేట్ల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న నిపుణుల బృందం



సదస్సులో మాట్లాడుతున్న మహబూబ్ బాషా

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా

డోన్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎస్.మహబూబ్ బాషా ఆకాంక్షించారు. గురువారం డోన్ పట్టణంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు యువ పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసాద్ గౌడు, డోన్ పరిశ్రమల శాఖ అధికారి శివప్రసాద్, పారిశ్రామికవేత్తలు మల్లయ్య, సురేష్, పాల్గొన్నారు.

నేడు శ్రీశైలంలో...

కర్నూలు కల్చరల్ (శ్రీశైలం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతీ కల్యాణమండపంలో వరలక్ష్మీవ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే మహిళలకు పూజా సామగ్రిని అందజేస్తామన్నారు. ఈ వ్రతాన్ని జరిపించుకునే మహిళలకు అమ్మవారి శేషవస్త్రాలుగా చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, లడ్డుప్రసాదం, పుస్తకప్రసాదంగా శ్రీశైలప్రభ, వృక్షప్రసాదంగా తులసి, ఉసిరి మొదలైన దేవతా మొక్కలను ఇస్తామన్నారు. వ్రతం అనంతరం ముత్తైదువులందరికీ స్వామి అమ్మవార్ల కైలాస కంకణాలు కూడా అందజేస్తూ, స్వామివారి అమ్మవార్ల దర్శనంతో పాటు అన్నపూర్ణ భవనంలో భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు.



శ్రీరస్తు.. సౌభాగ్యమస్తు..!

నేడు వరలక్ష్మీ వ్రతం ● ఆలయాల్లో, వివిధ ప్రాంతాల్లో సామూహిక వ్రతాలు



కర్నూలు కల్చరల్/ నంద్యాల కల్చరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే వేడుక 'వరలక్ష్మీ వ్రతం'. ఈ వేడుకను శుక్రవారం జిల్లాలోని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. ధార్మిక వాతావరణాన్ని ప్రతిబింబించే పవిత్ర శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఒక సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ దేవాలయాలు, ధార్మిక క్షేత్రాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అలాగే మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించనున్నారు. శ్రవణా నక్షత్రం వేంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రం కావడంతో శుక్రవారం జిల్లాలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సకల శుభాలకు ఆలవాలం

సంపదల తల్లిని అత్యంత భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా పూజించి, ఆమె కరుణాకటాక్షాల కోసం మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వరలక్ష్మీ వ్రతంలో అమ్మవారిని తామరపూలు, మొగలిచెండు, బిల్వము, చేమంతులు, మల్లెలు, గులాబీ పూలతో అర్చన చేస్తారు. మొగలి చెండ్లు, తామరపూలు అత్యంత ప్రాశస్త్యంగా భావిస్తారు. మహాదేవికి కుడుములు నైవేద్యంగా సమర్పించి, పసుపు, కుంకుమ, తాంబూలాదులతో ముత్తయిదువులకు వాయినంగా ఇస్తారు.





పూలు, పూజ సామగ్రి కొనుగోలులో నగర ప్రజలు

వరలక్ష్మీ వ్రత విశిష్టత

వరలక్ష్మీ వ్రతం రోజున మహిళలు భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరిస్తారు. వ్రత పురాణం, వ్రత విశిష్టతలను పురోహితుల ద్వారా ఆలకిస్తారు. పురాణాల ప్రకారం పూర్వం కాశీ క్షేత్ర గంగానదీ సమీపంలో కుండినం అనే గ్రామంలో బ్రాహ్మణ స్త్రీ చారుమతిదేవి మహాలక్ష్మీదేవికి అత్యంత భక్తురాలు. అత్తమామలను తల్లిదండ్రులతో సమానంగా భావిస్తూ, భర్తకు సేవలు చేస్తూ సంప్రదాయ గృహిణిగా పేరు పొందుతుంది. దీంతో వరలక్ష్మీ తన భక్తురాలైన చారుమతిదేవికి కలలో కనిపించి, వరలక్ష్మీ వ్రతం ఆచరించాలని సూచిస్తుంది. దీంతో ఆమె అత్తమామలు, భర్త అనుమతితో శ్రావణ మాసంలోని రెండో శుక్రవారం ఈ వ్రతం ఆచరిస్తుంది. ఆమె మొదటి ప్రదక్షిణ చేయగానే కాళ్లకు గజ్జెలు, రెండో ప్రదక్షిణ చేయగానే నవరత్న కచిత బంగారు ఆభరణాలు, మూడో ప్రదక్షిణ అనంతరం వస్తు,వాహనాలు వంటి సకల ఐశ్వర్యాలు కలుగుతాయి. చారుమతిదేవికి కలిగిన ఈ సౌభాగ్యాన్ని ముత్తయిదువులు కూడా ఆచరిస్తూ లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకుంటున్నారు.



కిటకిటలాడిన మార్కెట్లు

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురువారం నగరంలోని మార్కెట్ ప్రాంతం కళకళలాడింది. మహిళలు వ్రతాల అనంతరం వాయన, పూజ సామగ్రి కొనుగోళ్ల సందడి బాగా కనిపించింది. మరోవైపు పూజల్లో వినియోగించే మామిడి ఆకులు, అరటి బోదెలు, వివిధ రకాల పూజాద్రవ్యాలకు పాతబజార్, ఎన్ఆర్ పేట, సి.క్యాంపు రైతు బజార్ల వద్ద కొనుగోళ్ల సందడి కనిపించింది. ఇక పూజల్లో విశేషంగా ఉపయోగించే పూల ధరలు ఆకాశాన్ని తాకాయి. అన్ని వర్గాల వారు పూల కొనుగోళ్లకు రావడంతోపాటూ తక్కువ దిగుమతి ఉండటంతో మార్కెట్లో ఒక్కరోజునే పూల ధరలను వ్యాపారులు పెంచేశారు.


ఆదోని మార్కెట్ యార్డ్‌లో ప్లాట్ ఫాంపై మడుగును తలపిస్తున్న వర్షపు నీరు (ఫైల్)

ఆధునికీకరణ కాగితాల్లోనే..

- మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు కరువు
- వర్షం వస్తే పంట ఉత్పత్తులు తడవాల్సిందే
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- రూ.కోట్లలో ఆదాయం.. రైతులకు సేవలు శూన్యం

వ్యయ ప్రయాసలు ఓర్చి పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డ్‌కు విక్రయానికి అన్నదాతలు తీసుకొస్తే అక్కడే కనీస సౌకర్యాలు కూడా వారికి నోచుకోవడం లేదు. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్ కమిటీకి ఏటా రూ.17కోట్లు పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుంది. వర్షం వస్తే రైతుల పంట ఉత్పత్తులన్నీ ఆ వర్షపు నీటిలో ప్లాట్ ఫాంపైకి అడుగు లోతు నీరు చేరి వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. వర్షం వచ్చిన ప్రతీసారి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్లాట్‌ఫాంలా ఎత్తు పెంపు, పెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశించారు. అదే తడువుగా ఇంజనీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూ.21 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఏడాది గడిచినా కాగితాలకే పరిమితమయ్యాయి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని మార్కెట్ ఆధునికీకరణ పనుల కోసం రూ. 12 కోట్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఏడాది గడుస్తున్నా ఆధునికీకరణ అనేది కాగితాలకే పరిమితమైంది. మార్కెట్ కమిటీలకు రూ.కోట్ల ఆదాయం ఉన్నా రైతులకు కల్పిస్తున్న సేవలు మాత్రం శూన్యమే. మళ్లీ వర్షాలకు కురుస్తున్నాయి. ఇంకో నెలలో ఖరీఫ్ పంట ఉత్పత్తులు విక్రయానికి సీజన్ కూడా ఆరంభం అవుతుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్లాట్‌ఫాంలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. బోరు బావులు కింద సాగైనా వేరుశనగ దిగుబడులు రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. ప్లాట్ ఫాంపై చేరిన వర్షపు మడుగును చూసి రైతులు తమ పంట ఉత్పత్తులను ఎక్కడ దించాలో తెలియని పరిస్థితి. రాష్ట్రంలోనే ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు నిత్యం వేల మంది రైతులతో కళకళలాడుతుంది.


టీఎంసీ పత్తి ప్లాట్‌ఫాంపై చేరిన వర్షపు నీరు(ఫైల్)

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా..

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్ కమిటీకి ఏటా రూ.17 కోట్లు పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా రైతులకు మాత్రం సౌకర్యాలు కల్పించడంలో మార్కెటింగ్ శాఖ విఫలం చెందింది. వర్షం వస్తే మార్కెట్ కమిటీకి విక్రయానికి తెచ్చిన పంట ఉత్పత్తులన్నీ ఆ వర్షపు నీటిలో తడవాల్సిన పరిస్థితి ఉంది. డ్రైనేజీలు, వర్షపు నీరు ముందుకు వెళ్లక ఆనీరంతా ప్లాట్‌ఫాంపై చేరి రైతులు ఉంచిన పత్తి, వేరుశనగ ఇతర పంట ఉత్పత్తులన్నీ ఆ వర్షపు మడుగు నీటిలో కొట్టుకుపోతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తెచ్చిన వేరుశనగ ఆ వర్షపు నీటిలో తడిచి తీవ్రంగా నష్టపోయారు.



త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..

గత ఏడాది పాత యార్డులో దిగుబడులు తడవకుండా రూ.14కోట్లతో షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ప్లాట్ ఎత్తు, డ్రైనేజీలు మరమ్మతుల కోసం ప్రతిపాదించాం. ఆమోదం తెలపాల్సి ఉంది. ప్రస్తుతం రూ.1.38కోట్ల పనులకు టెండర్ పూర్తయింది. రూ.70లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, దుకాణాల ముందు గట్టరులు రూ.28లక్షలు, మరుగుదొడ్లు తాగునీటి కోసం పనులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

- సుబ్బారెడ్డి ఈఈ, మార్కెటింగ్ శాఖ, కడప

మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ ఆదోని మార్కెట్ యార్డ్‌లో పర్యటించి డ్రైనేజీలు ప్లాట్‌ఫాంలా ఎత్తు పెంపు, పెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అదే తడువుగా ఇంజనీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి రూ.21 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఏడాది గడిచినా కాగితాలకే పరిమితమయ్యాయి


ఇటీవల కురిసిన వర్షానికి వేరుశనగ దిగుబడుల మధ్య ప్లాట్‌ఫాంపై నిలిచిన నీరు

రూ. ఐదు కోట్లతో..

2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం టీఎంసీ యార్డులో రూ.5కోట్లతో పత్తి దిగుబడులు తడవకుండా జంబో కవర్డ్ షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పిల్లర్లు వేశారు. ప్రభుత్వం మారడంతో పైకప్పు పనులు మిగిలిపోయాయి. చేసిన పనులకు అధికారంలోకి వచ్చిన వైకాపా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. కవర్డ్ పైకప్పు వేయాలని కాంట్రాక్టర్‌కు పలుమార్లు కోరినా బిల్లు మంజూరు కాకపోవడంతో ముందుకు రాలేకపోయారు. మూడుసార్లు టెండరులు పిలిచినా ఒక్కరు కూడా టెండర్ వేసేందుకు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వంలోను పనులు మాత్రం ముందుకు సాగక మొండి గోడలకే పరిమితమైంది.

100కు పైగా దుకాణాలు శిథిలావస్థలో..

మార్కెట్‌లో 350కి పైగా దుకాణాలు ఉన్నాయి. ఇందులో 100కు పైగా దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పులన్నీ పెచ్చులూడి వర్షపు నీటికి గోడలన్నీ నెమ్ము చేరి గోడలు బీటలు వాడుతున్నాయని కమీషన్ ఏజెంట్లు వాపోతున్నారు. దుకాణాల ముందు ఉన్న రేకుల పెడ్డు నుంచి వరండాలో వర్షపు నీరు కిందికి వెళ్లేందుకు సరైన డ్రైనేజీలు లేకపోవడంతో ప్లాట్‌ఫాం పైకి నీరు చేరుతున్నాయి. పంట ఉత్పత్తులన్నీ తడిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నంద్యాల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన పట్టణంలోని విద్యుత్తు కార్యాలయం వద్ద చోటు చేసుకున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. వివరాలు.. పట్టణంలోని విశ్వనగర్‌కు చెందిన సుంకి రెడ్డి(62) అనే వృద్ధుడు గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లాడు. అదే సమయంలో విద్యుత్తు కార్యాలయం వద్ద రోడ్డు దాటుతుండగా ఓ బైక్ స్పీడుగా వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో సుంకిరెడ్డి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): నాగంపల్లికి చెందినశ్రీనివాసులు(58) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఏఎస్ఐ రామ్‌నాయక్ తెలిపిన వివరాలు.. నాగంపల్లికి చెందిన శ్రీనివాసులు భార్య సరోజమ్మ పేరుమీద నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. భూమి విషయంలో భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. ఈ నెల 5న రాత్రి శ్రీనివాసులు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

- పోలకల్లు జడ్పీహెచ్ఎస్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతాం
- ఎస్ఎస్ఏ రాష్ట్ర సంచాలకుడు శ్రీనివాసరావు


పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ రాష్ట్ర సంచాలకుడు శ్రీనివాసరావు

సి. బెళగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎస్ఏ రాష్ట్ర సంచాలకుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రమా, ఉపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంశ్రీ స్కూల్‌గా ఏర్పాటుచేసిన పోలకల్లు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల అభివృద్ధి నిమిత్తం ఎస్ఎస్ఏ ద్వారా అదనంగా రూ 26.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో క్రీడల కోసం గ్రౌండు, కెమిస్ట్రీ ల్యాబ్, ఖోఖో కోర్టు, వంటశాల నిర్మించాలని సూచించారు. పోలకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదర్శపాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో పీఎంశ్రీ వింగ్ లెక్చరర్ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

- ఐసీడీఎస్ పీడీ విజయ
- మహిళా శిశు సంక్షేమ పథకాలపై అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విజయ

వెల్దుర్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ పీడీ విజయ అన్నారు. గురువారం లిమ్రాస్ ఫంక్షన్‌హాలులో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలకు 'తల్లిపాల వారోత్సవాలు' కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో లూక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, మండల కన్వీనర్ బలరాంగౌడు, వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఐసీడీఎస్ పీడీ విజయ 'తల్లిపాల' ప్రాముఖ్యతను వివరించారు. మహిళాశిశు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై సలహాలు, సూచనలు తెలిపారు. అన్నప్రాసన, సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, సునీత, పద్మావతి, సరస్వతి, సుగుణమ్మ, అంగన్వాడీలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సర్వే చేసి గుర్తింపు కార్డులిస్తాం

- డీపీవో భాస్కర్


కరివేములలో స్వామిత్వ కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో

దేవనకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రతి ఇంటికీ సర్వేతో గుర్తింపు లభిస్తుందని, సర్వే చేసి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జి. భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కరివేములలో సర్వే ప్రారంభించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో గోపాల్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేసి, గ్రామకంఠం గుర్తించి ఆన్‌లైన్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో కరివేముల, చెల్లెలచెలిమల గ్రామాలు సర్వేకు ఎంపికయ్యాయి. ఇంటి ఆస్తి కొలతల తీసుకునేందుకు ఇంటిపన్ను రసీదు, ఇంటి నెంబరు ఉండాలన్నారు. కొలతల ఆన్‌లైన్లో నమోదు చేసి, ప్రతి ఇంటికి గుర్తింపు కార్డు అందిస్తామన్నారు. పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీరామ్‌నాయక్, లక్ష్మన్న, రఫీ, నబిరసూల్, సునీల్, రంగమ్మ, సునీత, తులసి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అర్ధరాత్రి ఏమైంది?

- శిశువును ఎత్తుకెళ్లేందుకే వచ్చారా?
- హల్‌చల్ చేసిన ముసుగు దొంగలు
- చిన్నపిల్లల వార్డులో సెల్‌ఫోన్ చోరీ
- నిఘా వైఫల్యమే కారణమా?

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో బుధవారం అర్ధరాత్రి ఏమైంది. అంతా నిద్రిస్తున్న వేళ ముసుగులు వేసుకున్న ఇద్దరు చిన్నపిల్లల వార్డు వద్దకు ఎందుకు వచ్చారు. శిశువులను ఎత్తుకెళ్లేందుకేనా? లేక సెల్‌ఫోన్ చోరీ చేయడానికి వచ్చారో తెలియదు. ఏదిఏమైనా జీజీహెచ్‌లో దొంగలు హల్ చేస్తున్నారు. రోగులు, వారి బంధువులు తెలిపిన వివరాలు.. కర్నూలు నగరానికి చెందిన ఓ మహిళ తన నాలుగు నెలల శిశువు అనారోగ్యానికి గురైతే వైద్యులు ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. రాత్రి తల్లి, శిశువు నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి ముసుగు వేసుకున్న ఓ ఇద్దరు దొంగలు వచ్చి వరండాలోని ఉన్న లైట్లను ఆర్పేసి ఐసోలేషన్‌లో ప్రవేశించారు. మంచం కింద నుంచి శిశువు దగ్గరకు వెళ్లి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా తల్లి మేల్కోవడంతో దొంగ పరారయ్యారు. మళ్లీ తెల్లవారుజామున ముసుగు దొంగ వచ్చి శిశువు దగ్గరకు వచ్చి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా.. సాధ్యం కాకపోవడం తల్లి దగ్గర ఉన్న ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున మరో ఇద్దరు దొంగలు వచ్చి లైట్లు ఆఫ్ చేసి దొంగతనాలకు పాల్పడ్డారు. సీసీ కెమెరాలు లేకపోవడం, సెక్యూరిటీ నిఘా వైఫల్యాల వల్ల ఇటీవల ఆసుపత్రి దొంగతనాలు ఎక్కువైపోతున్నాయి. ఆసుపత్రిలో కేవలం 140 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ సంఖ్యను పెంచి హాస్పిటల్‌లో రాత్రి పూట గస్తీని పెంచి దొంగతనాలు అరికట్టాలని రోగులు కోరుతున్నారు.



దొంగతనం జరిగిన చిన్న పిల్లల వార్డు

పంటలకు ఈక్రాప్ తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి


ఏ.గోకులపాడులో పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి

కల్లూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని ఏ.గోకులపాడు గ్రామంలో ఆమె పంటనమోదు కార్యక్రమంలో పాల్గొని ఈ-పంట నమోదును పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంట నమోదు త్వరగా పూర్తిచేసి ఈకేవైసీ కూడా పూర్తిచేయాలని వీఏఏలను ఆదేశించారు. గ్రామంలో వ్యవసాయ పరికరాలను వ్యవసాయ యాంత్రీకరణ జాబితా అనువర్తనం అనే యాప్‌లో పొందుపరిచి, కొత్తగా వ్యవసాయ పరికరాలు అవసరం ఉన్న జాబితా సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు సాలురెడ్డి, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, వీఏఏ రక్షిత, రైతులు పాల్గొన్నారు.

బురద గుంటలో వ్యక్తి మృతదేహం

కొలిమిగుండ్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నాపరాళ్ల ఫ్యాక్టరీల వేస్ట్ వాటర్ నిల్వ ఉండే బురద గుంటలో గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. వివరాలివీ.. కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన పింజారి చాంద్‌బాషా(27) తన తండ్రి పీరాతో కలిసి లారీ క్లీనర్‌గా పనులు చేసుకోవడానికి కొలిమిగుండ్లకు వచ్చారు. స్థానిక విజయసాయి లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో ఉంటూ తండ్రి పీరా లారీ డ్రైవర్‌గాను, కుమారుడు చాంద్‌బాషా క్లీనర్‌గాను పనులు చేసుకుంటున్నారు. అయితే మంగళవారం మద్యం తాగి చాంద్‌బాషా కొలిమిగుండ్ల టౌన్‌లోకి వెళ్లి వస్తానని చెప్పి కనిపించకుండా పోయారు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తండ్రి పీరా వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. తల్లి కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గురువారం ఉదయం ట్రాన్స్‌పోర్ట్ సమీపంలోని నాపరాళ్ల ఫ్యాక్టరీ బురద గుంటలో మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సీఐ రమేష్‌బాబు ఆదేశాల మేరకు ఏఎస్ఐ బాబావక్రుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని యబటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సారా స్వాధీనం

కర్నూలు అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆటోలో సారా తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. గురువారం కల్లూరు మండలం కొల్లంపల్లి తండాకు చెందిన లక్ష్మీబాయి, పెద్ద కొట్టాలకు చెందిన మహబూబ్ బాషా సారాను లక్ష్మీపురం గ్రామంలోని సంధ్య పోగు కనక సూర్యం ఇంటి ముందు దింపుతుండగా సీజ్ చేశామని తెలిపారు. ఆటో, 3 సంచుల్లో 600 ప్యాకెట్లు(60) లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపామని తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ కె.నవీన్ బాబు, కానిస్టేబుళ్లు, సిబ్బంది ఈరన్న, మధు, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఎం. రాజు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటిచెప్పండి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని చాటి చెప్పేలా పంద్రాగస్టు వేడుకలు, తిరంగ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమాల ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగ (ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా) కార్యక్రమాలను జిల్లాలో నిర్వహించడం జరుగుతోందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పతాక ప్రదర్శనలు, రంగోలీ పోటీలు, పతాక రాఖీ తయారీ, వర్క్‌షాప్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. హర్‌ఘర్ తిరంగ సెల్ఫీ పాయింట్, బూత్‌లను ఏర్పాటు చేసి సెల్ఫీ ఫొటోలను 'హర్‌ఘర్‌తిరంగ' వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెట్కూరు సీఈవో కే.వేణుగోపాల్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఈవో శామ్యూల్ పాల్, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

రూ.9 లక్షలు కాజేశారు

- విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై మార్క్‌ఫెడ్ యాజమాన్యం ఫిర్యాదు

హాలహర్వి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాపురం, నిట్రవట్టి గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతులకు అందించిన ఎరువుల డబ్బులు రూ.9 లక్షలు చెల్లించకుండా కాజేశారని మార్క్‌ఫెడ్ కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. రైతులకు అందించే యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పంపిణీ చేసి ఆ డబ్బును తిరిగి బ్యాంకు ద్వారా కంపెనీ చెల్లించాలని, అయితే అగ్రికల్చర్ అసిస్టెంట్ డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో బాపురం, నిట్రవట్టికి ఎరువులు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. త్వరలో డబ్బులు చెల్లించకపోతే ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అదేవిధంగా పచ్చారపల్లి రైతులతోనూ రాయితీ యంత్రాలు ఇస్తామని డబ్బులు వసూలు చేసినట్లు గ్రామ రైతులు ఆరోపించారు. ఈ విషయాన్ని ఆలూరు ఏడీఏ చెంగల్‌రాయుడు దృష్టికి తీసుకెళ్లగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కంపెనీకి చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం వాస్తవమేనని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఆయనపై చర్యలు ఉంటాయని చెప్పారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

బస్సు డ్రైవర్లకు గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): లారీని ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసం కావడంతో పాటు డ్రైవర్లకు గాయాలైన ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి మార్నింగ్‌స్టార్ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన సూపర్‌లగ్జరీ బస్సు హైదరాబాదుకు వెళ్తుంది. మార్గమధ్యలో తెల్లవారుజామున జాతీయరహదారి-44 లద్దగిరి క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ముందర స్పీడ్ బ్రేకర్ ఉన్నందున లారీ డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న బస్సు గమనించకుండా లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్లు అనిల్, సిద్దు విలాస్‌కు గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం నుజ్జయింది. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. బస్సును క్రేన్ సాయంతో రోడ్డుపక్కకు తరలించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రయాణికులు ఇతర వాహనాలలో తరలివెళ్లారు.

బీసీలపై కక్ష సాధింపు చర్యలు తగవు

● వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ నాయుడు



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బీసీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగవని వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ నాయుడు అన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలపై దాడులు ఆపకపోతే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. బీసీలకు రక్షణ కరవైందని ఆరోపించారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడికి నిరసనగా నంద్యాలలో నిరసన తెలిపినట్లు తెలిపారు. నాయకులపై కక్ష సాధింపు చర్యలు మంచిది కాదన్నారు. బీసీ నాయకులు పుల్లయ్య, చిన్నబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

'శిల్పా కుటుంబంపై విమర్శలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

నంద్యాల రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శిల్పా కుటుంబంపై విమర్శలు సరికాదని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. నంద్యాలలోని వైసీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల నుంచి నంద్యాల ప్రజలకు వారు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. అటువంటి కుటుంబంపై నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు విమర్శించడం చాలా బాధాకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శశికళ, రవికుమార్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

వెలుగోడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి సూచించారు. గురువారం ఆయన వెలుగోడు పట్టణంలోని సచివాలయంల 2 లో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మురారి, పీఎస్ నరేంద్ర, ఇనాయత్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేషన్‌కార్డులు లేని వారికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండు చేశారు. పోతులపాడు, చాబోలు, 80బన్నూరు గ్రామాల ప్రజ లకు జూపాడుబంగ్లాలో ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు గాబ్రియేల్, నరసింహులు, ఏసన్న, శ్రీనివాసులు, మాధవనాయుడు, సోమప్ప, రంగన్న, వెంకటలక్ష్మమ్మ, ఆశాబీ పాల్గొన్నారు.

మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలి



గువ్వలకుంట్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గృహాల ముందు పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చేస్తే రోగాలు ప్రబలవని జిల్లా మైక్రో బయాలజీ వైద్యుడు సచిన్ సుమంత్ గ్రామస్థులకు సూచించారు. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో గత కొన్ని రోజులుగా ప్రజలు విషజ్వరాల బారిన పడిన నేపథ్యంలో గురువారం వ్యాధుల నిర్మూలన రీసెర్చ్ బృందం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి విషజ్వరాల లక్షణాలపై పరిశీలన చేపట్టారు. ముందుగా ఆయా కాలనీల్లో వీధుల్లో తిరుగుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాలతో పాటు ఇంటి ముందు ఉన్న నీటి తొట్లను ప్లాస్టిక్ డ్రమ్ముల నీరును వైద్యబృందం పరిశీలించింది. వైద్యుడు సచిన్ సుమంత్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో విషజ్వరాలు, నీరు కలుషితం వల్ల వచ్చాయా.. దోమకాటు వల్ల రోగాలు ప్రబలాయా అనే వాటిపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వివిధ రోగాలతో బాధపడుతున్న వారి రక్తసేకరణ చేశామని తెలిపారు. వీటిని వ్యాధి నిర్ధారణ కేంద్రానికి పంపిస్తామన్నారు. వర్షం పడుతున్న సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రత, పరిసరాలు శుభ్రతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ శంకర్ నరేన్, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు జాహ్నవి, జిల్లా ఎపిడమాలజిస్టు రమేష్, కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యులు మహ్మద్ బేగ్, దీపా నాగవేణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నత్తనడకన పనులు

● రెండేళ్లయినా ఇసుక వాగుపై పూర్తి కాని వంతెన
● వర్షాకాలం మొదలవడంతో ఆందోళనలో ప్రజలు

జూపాడుబంగ్లా, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇసుక వాగుపై నిర్మించే వంతెన పనులు మార్చిలోపు పూర్తిచేసి వివిధ గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందిలేకుండా చేస్తామని మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నమాటలివీ. 2023 ఆగస్టు 8వ తేదీన పారుమంచాల ఇసుకవాగుపై వంతెన పనులను ప్రారంభించి ఏడు నెలల్లో పనులు పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులులే కుండా చేస్తామన్న మాటలు ఇవీ. ఆ పనులకు నేటికి దిక్కులేదు. మండలంలోని పారుమంచాల ఇసుకవాగుపై వంతెన పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. రూ. 5కోట్లతో ఎండీఆర్ నిధులు కింద చేసే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అప్పటినుంచి ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేయించడంలో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో దీన్నిబట్టి అర్థమవుతోంది. ఇసుకవాగు వస్తే 10 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. పారుమంచాల, తూడిచర్ల, వాడాల, రేగడగూడూరు, మద్దూరు, కనకయ్యకొట్టాల, వెలుగోడు తదితర గ్రామాలకు ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహిస్తే గ్రామాలకు సంబంధాలు తెగి పోతాయి. ఇటు నందికొట్కూరుకు కళాశాలలకు వెళ్లాలంటే వాగు వచ్చిందంటే ఆరోజు సెలవే. ఇదేకాకుండా మూడేళ్ల క్రితం వాగులో ఆర్టీసీబస్సు కొంత దూరం కొట్టుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం చొరవచూపి త్వరితగతిన పనులు పూర్తిచేయించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆర్ అండ్ బీ ఏఈ మనోధర్‌ను వివరణ కోరగా నిధుల విడులలో జాప్యం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయి. సెప్టెంబరులోపు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.



అసంపూర్తిగా వంతెన



ఉప్పొంగి ప్రవహిస్తున్న ఇసుకవాగు (ఫైల్)

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

● టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు దేవళ్ల మురళి



మాట్లాడుతున్న దేవళ్ల మురళి

నందికొట్కూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు దేవళ్ల మురళి అన్నారు. పట్టణంలోని తొగటవీర క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్, లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించిన చంద్రబాబుకు చేనేతలు రుణపడి ఉండాలన్నారు. హ్యాండ్లూమ్ వస్త్రాలపై ఉన్న జీఎస్టీని భరిస్తామని ప్రభుత్వం చెప్పడం అభినందనీయమని తొగటవీర క్షత్రియ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ అన్నారు. కార్రమంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం నాయకులు వీంద్రబాబు వేణుగోపాల్, దేశెట్టి శ్రీనివాసులు, గోవర్ధన్‌గిరి, జల్లు రామచంద్రుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాములపాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంతో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగుపై బ్రిడ్జి నిర్మాణం, కోల్స్ ఆనందాపురం బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలన్నారు. క్రిష్ణారావుపేట నుంచి మిట్టకందాల, పాములపాడు నుంచి చెలిమిళ్ల దారులు నేషనల్ హైవే పనుల్లో భాగంగా భారీ వాహనాలు వెళ్తుండటంతో పూర్తిగా దెబ్బ తిన్నాయని, వెంటనే రహదారులు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే బనకచర్ల, గుండాలనట్లు గ్రామాల్లో పేదలు నివాసముంటున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డియాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కోటి రూపాయలతో అభివృద్ధి పనులు

● మహానంది దేవస్థానం ఈవో శ్రీనివాసరెడ్డి
● కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం పరిశీలన



తమ్మడపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం తమ్మడపల్లిలో శిథిలావస్థలో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి దేవదాయశాఖ రూ. 1 కోటి నిధులతో అభివృద్ధి పనులను చేస్తున్నట్లు మహానంది దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం తమ్మడపల్లిలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని ఈవో పరిశీలించారు. గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఆలయ జీర్ణోద్ధరణ పనుల కోసం టెండర్లు పిలిచామన్నారు. దీనికోసం ఆలయంలో బాలాలయం పూజలు చేసి నిర్మాణ పనులను చేస్తామన్నారు. దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ప్రసాదం తయారీలో నాణ్యత పాటించాలి

భక్తులకు నిరంతరం ఉచితంగా అందించే ప్రసాదం తయారిలో నాణ్యత పాటించాలని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సూచించారు. మహానంది ఆలయంలో భక్తులకు దేవస్థానం ఉచితంగా పంపిణీ చేసే ప్రసాదాన్ని గురువారం ఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రసాదం పంపిణీలో ఎలాంటి లోటు లేకుండా కూడాలని, ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దర్శనం సమయంలో భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు. పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

ఆత్మకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నబీరసూల్ ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదిన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆయన అల్లుడు షేక్షావలి ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన ఆత్మకూరు అర్బన్ సీఐ రాము నబీరసూల్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆయనను అదుపులోకి తీసుకుని వారికి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఇన్నర్‌రింగ్ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, కోఆప్షన్ సభ్యుడు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో రూ.3 కోట్ల నిధులతో నిర్మించనున్న ఇన్నర్ రింగురోడ్ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలకు నిర్ణీత గడువులోగా ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు ఇన్నర్ రింగు రోడ్డును అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు.అనంతరం రోడ్డు పనులను పరిశీలించి కాంట్రాక్టర్ ఉపేంద్రారెడ్డికి తగిన సూచనలు చేశారు. వీరి వెంట ఏఈ షాహీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు ఉన్నారు.

'నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు'



పోస్టరును విడుదల చేస్తున్న ఎంపీడీవో

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నులి పురుగులను పూర్తిగా నిర్మూలించి, రక్త హీనతను తగ్గించేందుకే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్, వైద్యాధికారి పవన్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. ఈనెల 12న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పంపిణీ చేయనున్న ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకతకు సంబంధించిన పోస్టరును గురువారం ఎంపీడీవో కార్యాలయంలో విడుదల చేశారు. వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. 5 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వరకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం చేతుల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణమ్మ, హెల్త్ నర్సులు భ్రమరాంబ, మధు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

వెలుగోడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు వెంకటయ్య, నాగమోహన్, మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. వెలుగోడు విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో విధించిన అదనపు చార్జీల భారంతో పాటు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని అన్నారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రెహంతుల్లా, బాషా, ఆంజనేయులు, భాస్కర్, మహమ్మద్, నాగరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతంతో సమానం



నంద్యాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నంద్యాల టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అమ్మపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని అంజుమాన్ వీధి, సుంకులమ్మ వీధి, రోజాకుంటా వీధిలోని అంగన్‌వాడీ సెంటర్లల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలల్లో ఐరన్, మినరల్స్, కాల్షియం, విటమిన్లు అన్ని ఉంటాయన్నారు. బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల రాబోయే రోజుల్లో తల్లికి ఆరోగ్య సమస్యలకు తీవుండదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు సునీత, వరలక్ష్మి, మద్దమ్మ, పక్కీరమ్మ, మాచర్లమ్మ ఏఎన్ఎంలు, ఏఎస్‌ఎచ్‌ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.



బండిఆత్మకూరులో..

మహనీయులను స్మరించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ఆత్మకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని డీఆర్‌డీఏ - వెలుగు ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు పట్టణంలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ ఉమర్, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆత్మకూరు ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య, ఏపీఎం కాశీశ్వరుడు, వెలుగు సీసీలు ఉన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామి గురువారం విశేషపూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం ముందుగా గణపతి పూజ నిర్వహించి దత్తాత్రేయ స్వామి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

ముగిసిన ఏఐ వర్క్‌షాప్

పాణ్యం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వర్క్‌షాప్ గురువారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యవక్తగా హైదరాబాద్ బిర్లా సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సైంటిస్టు శేషగిరిరావు పాల్గొన్నారని చెప్పారు. కృత్రిమ మేధస్సు రంగంలో తాజా అభివృద్ధి, అవకాశాలు, విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, రామిరెడ్డి, హెచ్‌వోడీ సుబ్బారెడ్డి, సునీల్ విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ అయ్యవారయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

నందికొట్కూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో సీజ్ అయిన వాహనాలకు శనివారం వేలం వేయనున్నట్లు నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ సి.ఐ. రామాంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ అయిన 8 వాహనాలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంపాటలో పాల్గొని వాహనాలను దక్కించుకోవాలని సూచించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఆత్మకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ కల్యాణ మంటపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగానాయక్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపాల్ సుంకన్న, టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, అధ్యాపకులు ఉన్నారు.

బండిఆత్మకూరు: విద్యార్థులు చెడుకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ వెంకటనారాయణ సూచించారు. గురువారం బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇటీవల పదవీ విర మణ పొందిన గణితశాస్త్ర అధ్యాపకుడు రామసుబ్బారెడ్డిని అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు రఘునాథరెడ్డి, నశీరుద్దీన్, సురేష్, ప్రసాద్, శివరామకృష్ణ, మౌలాలి, కిరణ్, జయమ్మ, రామతులశి పాల్గొన్నారు.

దేశ ఆహార భద్రతకు స్వామినాథన్ కృషి



ఆత్మకూరులో స్వామినాథన్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశ ఆహార భద్రత కోసం వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ స్వామినాథన్ అని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు మాబాషా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్ బాషా కొనియాడారు. స్వామినాథన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని కృషి పండ్ల తోటల సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, శ్రీనివాసులు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: వ్యవసాయ రంగంలో అద్భుతమైన నూతన వంగడాలను సృష్టించి హరిత విప్లవ పితామహుడిగా పేరొందిన స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమన్న కోరారు. గురువారం పాములపాడులోని నెమిలి వెంకటరెడ్డి భవన్ సీపీఎం కార్యలయంలో స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దు

● కర్నూలు జేసీ నవ్య



మాట్లాడుతున్న కర్నూలు జాయింట్ కలెక్టర్ నవ్య

డోన్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని కర్నూలు జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పట్టణ, మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు జేసీ హాజరై ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. అక్రమ లేఅవుట్లపై ప్రజలకు అవగాహన కల్పించి రెగ్యులరైజేషన్ చేసుకునే విధంగా చూడాలన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ కింద 14 శాతం ఉండేదని, ఇప్పుడు 7 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. సమావేశంలో డీఎల్‌డీవో నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, మోహన్ కుమార్, విజయభాస్కర్, ఈవోఆర్‌డీ ఫక్రుద్దీన్ సాహెబ్, ఏపీవో హయత్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

గుండుపాపల సొసైటీ చైర్మన్‌గా కాశీవిశ్వనాథ్‌రెడ్డి



ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న కాశీవిశ్వనాథ్‌రెడ్డి

దొర్నిపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండు పాపల సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా కాశీవిశ్వనాథ్‌రెడ్డి ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆళ్లగడ్డ టీడీపీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు, టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డిపాటి రాజశేఖర్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రమణ, ఓబుళరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, అవర్ణ ఉన్నారు.

వైభవంగా వరలక్ష్మీ దేవికి పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

చాగలమర్రి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం సాయంత్రం వేద పండితుడు పెద్దశాస్త్రి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముందస్తుగా వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వరలక్ష్మీదేవి విశిష్టత గురించి వేద పండితులు వివరించారు. అనంతరం సాయిబాబాకు జల, పాలాభిషేకం చేశారు. సాయిబాబా చిత్రపటాలతో పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

డోన్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం డోన్ ఐసీడీఎస్ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ 'టీ.. తాగుతూ మాట్లాడుకుందాం' అని వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



మదనంతపురంలో ప్రవహిస్తున్న వరద

కొలిమిగుండ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం, చింతలాయపల్లె, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె, తుమ్మలపెంట, గొర్విమానుపల్లె, పేట్నికోట, బందార్లపల్లె, అబ్దులాపురం గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీవర్షం కురిసింది. పలు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. మదనంతపురంలోని పలు కాలనీలు వరద నీటితో జలమయమయ్యాయి. పెట్నికోట ఎర్రవాగుకు పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించింది. రాఘవరాజుపల్లె రజకులకు చెందిన బొగ్గుల మూటలు, డ్రమ్ములు వరదలో కొట్టుకుపోయాయి. చాలా కాలం తర్వాత వాగులు, వంకలు ప్రవహించడంతో ప్రజలు నీటి ప్రవాహాన్ని ఆసక్తిగా తిలకించారు.

పెళ్లి కానుకలు పంపిణీ



పెళ్లికానుకలను అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలోని నాలుగు పేద కుటుంబాలకు గురువారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పెళ్లికానుకలు పంపిణీ చేశారు. నవ వధువుకు పెళ్లికానుకలు ఆయన తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలోని పేద కుటుంబీకులకు తనవంతుగా పెళ్లికానుకలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో పేద వధువుకు ఈ పెళ్లికానుకలు సొంత నిధులతో అందిస్తున్నామన్నారు.

పిల్లర్లకే పరిమితం

- అసంపూర్తి నిర్మాణాలతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న భవనాలు
- బిల్లులందక పనులు నిలిపివేత
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పునాదులకే పరిమితమైన రైతు భరోసా కేంద్ర భవనం

కొలిమిగుండ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసం గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ వ్యవస్థను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అందుకు కావాల్సిన భవన నిర్మాణాలను అసంపూర్తిగానే వదిలేసింది. అనేక గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ తదితర భవన నిర్మాణ పనులు మధ్యలో వదిలేయడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. రూ.కోట్లు నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో, నిధులు వృథాగా మారాయి. ప్రభుత్వ ఉదాసీన వైఖరి.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. బిల్లుల్లో జాప్యం .. వెరసి భవన నిర్మాణాలు పూర్తి కాని పరిస్థితి నెలకొంది. మండలంలోని బెలుం గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ



బెలుంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనం

పనులు గత ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు సాగదీస్తూనే వచ్చారు. దీంతో అది పూర్తికాక, ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. మరోవైపు రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం పునాదులకే పరిమితం అయింది. మండలంలోని అంకిరెడ్డి పల్లె, తోళ్లమడుగు, తిమ్మ నాయినిపేట, గొర్విమానుపల్లె గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తికాలేదు. దీంతో ఇటు సచివాలయ ఉద్యోగులు, అటు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొలిమిగుండ్ల మండలంలో 16 గ్రామ సచివాలయ భవనాలు నిర్మించతల పెట్టగా, అనేక గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కాలేదు. నిర్మాణాలు పూర్తి చేసుకొని, ప్రారంభించిన భవనాల్లో సైతం పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదన్న విమర్శలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న గ్రామీణులు

ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామీణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ స్థాయిలో మౌలిక వసతులతో కూడిన భవనాలు అందుబాటులో ఉంటేనే పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. త్వరితగతిన మిగిలిన పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.



సంజామలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ - 1 భవనం

నిధులు లేక నిలిచిన పనులు

సంజామల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్ వాడీ భవనాల పనులు నిధులు లేక నిలిచి పోయాయి. మండల కేంద్రమైన సంజామల - 1, 2, ఆల్వకొండలో - 1 , ఎగ్గోని - 1, నట్లకొత్తూరు - 1 భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సంజామల - 1వ సెంటర్ అంగన్‌వాడీ భవనానికి జెడ్‌పి నిధులు రూ.5లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 2లక్షలు కేటాయించారు. ఈ నిధులతో భవన నిర్మాణ పనులు స్లాబ్ వరకు పూర్తి అయ్యాయి. ఫ్లోరింగ్, ఎలక్ట్రిసిటీ, కార్పెంటర్ పనులు పూర్తి కాలేదు. నాడు - నేడు కింద సంజామల - 2వ సెంటర్, ఎగ్గోని, నట్లకొత్తూరు, ఆల్వకొండ ఒక్కొక్క సెంటర్‌కు నిధులు లేక పిల్లర్ స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. అసౌకర్యాల మధ్య పాత భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో పైకప్పు కారడం, ఉక్క పోతకు చిన్నారులు మగ్గిపోతున్నారు. సంబంధిత అధికారులు నిధులు విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తొలిసారిగా..

- బడుగులకు కోవెలకుంట్ల మార్కెట్ యార్డు పీఠం
- అవకాశం ఇచ్చిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సంచలన నిర్ణయాలతో పాటు అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది. అణగారిన వర్గాలకూ అందలం ఎక్కించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈ క్రమంలో పాలకమండళ్ల కమిటీలోనూ సామాజిక న్యాయం పాటిస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్కెట్ యార్డు కమిటీల్లో కోవెలకుంట్లను ఎస్సీ(మహిళ)లకు కేటాయించారు. కోవెలకుంట్ల మార్కెట్ యార్డు చరిత్రలో ఎస్సీలకు అందనిద్రాక్షలా ఉన్న మార్కెట్ యార్డు పీఠం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చొరవతో సాధ్యమైంది. కోవెలకుంట్ల మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్‌గా దళిత వర్గానికి చెందిన జి.మధులతను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మండల టీడీపీ నాయకుడు, కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి సహకారంతో పాటు మండల నాయకులు ఏకగ్రీవంగా జి.మధులతను ఎంపిక చేసి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆమెతో పాటు వైస్ చైర్మన్‌గా ఆల్వకొండ గ్రామానికి చెందిన నందిరెడ్డి విష్ణుశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఇక డైరెక్టర్లుగా యల్ల నాగేంద్రమ్మ, చందుల శివశంకర్‌రెడ్డి, ఎస్.చిన్నసుబ్బారెడ్డి, మల్లు సుజాత, నల్లగట్ల ఇందిరమ్మ, కల్లూరి రాజేశ్వరి, ఎస్.సాహెబ్‌బాషా, ముదిగొండు వీరమ్మ, డి.లక్ష్మీసుబ్బు, బోయచంద్ర, చెన్నకృష్ణుడు, మంద విజయ్, మాణిపాటి చంద్రలు ఎంపికయ్యారు. త్వరలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో



కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు కార్యాలయం



చైర్‌పర్సన్ మధులత

ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు నాయకులు ఏర్పాటు చేస్తున్నారు.

దళితులకు అండగా ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాజిక న్యాయం పాటిస్తోంది. బడుగు, బలహీన వర్గాల కోసమే తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించింది. బనగానపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో కోవెలకుంట్ల మార్కెట్ యార్డు పదవి నేడు ఎస్సీలకు రిజర్వ్ అయింది. కోవెలకుంట్ల సొసైటీ కమిటీతో పాటు మార్కెట్ యార్డు అభివృద్ధిని అన్ని రంగాల్లో కృషి చేస్తామన్నారు. చైర్‌పర్సన్‌గా ఎంపికైన మధులతకు అభినందనలు. రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తాం.

- గువ్వల సుబ్బారెడ్డి, కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత కళాకారుడు సీతా రామయ్యను సత్కరిస్తున్న అధికారులు

బనగానపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందివర్గంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నందివర్గం చేనేత సహకారం సంఘం పరిధిలోగల గ్రామ సచివాలయంలో నలుగురు చేనేత కళాకారులను జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి నరసింహారెడ్డి, సహాయ అభివృద్ధి అధికారి శ్రీవాణి ఆధ్వర్యంలో సత్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత కళాకారుడు కాల్వ సీతారామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

బనగానపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె శాఖ గ్రంథాలయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని నిర్వహించారు. ఠాగూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం శ్రీరాములు, గ్రంథాలయ సిబ్బంది అరుణ గీతామణి, పాఠకులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి: యూటీఎఫ్

బనగానపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యప్రకాశ్ కోరారు. గురువారం బనగానపల్లె యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8న చివరి తేదీగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వరుసగా మూడు రోజు సెలవు రావడం వల్ల దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని జిల్లా విద్యాధికారులను ఆయన కోరారు. సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కందుకూరు కో ఆపరేటివ్ చైర్మన్‌గా మాబుబాషా



టీడీపీ నాయకులను సన్మానిస్తున్న మాబుబాషా

ఆళ్లగడ్డ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట కందుకూరు కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎస్ మాబుబాషా ఎంపికయ్యారు. గురువారం టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, జగత్ విఖ్యాత్ రెడ్డిని సొసైటీ చైర్మన్ మాబుబాష పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కూడా కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి అన్నారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చేతుల శుభ్రత పాటించాలని సూచించారు. జలుబు, జ్వరాలు అధికంగా ఉంటే వైద్య చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శివలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, జ్ఞానాపురం గ్రామాల్లో 'ఆగిన అంగన్‌వాడీ భవన పనులు' అన్న శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దాంతో స్పందించిన పీఆర్ ఏఈ కొండారెడ్డి పర్యవేక్షణలో అంగన్‌వాడీ భవన మరమ్మతు పనులు చేపట్టారు. ఒక్కో భవనానికి రూ.9 లక్షలు నిధులు కేటాయించారని, ఆ నిధులతో భవనాల పనులు వేగవంతం చేస్తున్నామని ఏఈ పేర్కొన్నారు. పనులు పూర్తి చేసి అంగన్‌వాడీ కేంద్రాలను ఆ శాఖ వారికి అప్పగిస్తామన్నారు.

ఎట్టకేలకు ఎర్రమట్టి వేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డోన్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు నిల్వ కుండా ఉండేందుకు ఎర్రమట్టిని వేసి గుంతలను పూడ్చారు. ఈ నెల 4 న 'వర్షం పడితే అవస్థలే' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దాంతో స్పందించి అధికారులు పాఠశాల ప్రాంగణంలో గుంతలున్న చోట ఎర్రమట్టిని వేసి పూడ్చారు.

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

రుద్రవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్ అన్నారు. గురు వారం మండలంలోని చిన్నకంబలూరు మెట్ట వద్ద గల ఫంక్షన్‌హాలులో సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు అధ్యక్షతన రైతుల సమావేశం నిర్వహించారు. హరిత విప్లవ పితామహుడు వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ స్వామినాథన్ శత జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రైతులందరూ సంఘటితంగా ఉద్యమిస్తే రైతాంగం వ్యతిరేక విధానాలను తిప్పికొట్టొచ్చన్నారు. సమావేశంలో గురిరెడ్డి, కేశాలు, హుసేన్‌బాషా, హరినారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు వసతులు కల్పించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కృష్ణార్జున నగర్‌లో తాగునీటి పైపులైన్‌కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, టీడీపీ యువ నాయకుడు గార్లదిన్నె సుధాకర్, కాలనీవాసులు కె.అర్జున్, బలరామ్, రామకృష్ణ పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీతోనే ప్రజల సంక్షేమం సాధ్యమన్నారు. త్వరలో పట్టణంలోని అన్ని కాలనీలకు సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు.

● దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద కోట్ల అభిమానులు రైల్వే సుభాన్, కోట్ల యూత్ ఎస్ఎండీ అజీజ్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలబాలికలకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. మొత్తం 26 జట్లుకు కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. ఫైనల్ మ్యాచ్ ఈ నెల 16న నిర్వహించి గెలుపొందిన జట్టుకు ప్రథమ, ద్వితీయ బహుమతులను రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్, ఆర్ఈ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే చైర్మన్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఎల్లగౌడు,



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

చనుగొండ్ల శ్రీరాములు, చిట్యాల మద్దయ్యగౌడు, జనసేన బ్రహ్మం, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్య గౌడు, చంద్రపల్లి లక్ష్మీనారాయణ యాదవ్, మల్కాపురం పెద్ద తిమ్మయ్య, డీఈ రఘు, ఏఈ సురేష్, వలసల బాలుడు, వలసల సుధాకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పట్టణంలోని డాక్టర్ ప్రభాకర్ రెడ్డి కాలనీకి చెందిన వ్యక్తికి మంజూరు అయిన సీఎం సహాయ నిధి కింద రూ.2.25 లక్షల చెక్కును ఎమ్మెల్యే కోట్ల అందించారు.



గోగిశెట్టి నరసింహారావును సన్మానిస్తున్న మల్లయ్య

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం

శిరివెళ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు అన్నారు. ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య భార్య మైలేరి సురేఖ ఇటీవల నియామకం కావడంతో మైలేరి మల్లయ్య తన అనుచరులతో గోగిశెట్టి నరసింహారావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామంలో ఆయన స్వగృహంలో నరసింహారావును శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

రాజకీయాల్లో సముచిత స్థానం ఇవ్వాలి

ఆళ్లగడ్డ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బలిజ కులస్థులకు రాజకీయాల్లో సముచిత స్థానం ఇవ్వాలని బలిజ సంఘం అధ్యక్షుడు నల్లగట్ల బాలుడు కోరారు. గురువారం శ్రీ కృష్ణ దేవారాయలు సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బలిజలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం మినీ థియేటర్ వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఎంవీ ప్రసాద్, నియోజక వర్గం జనసేన పార్టీ సమన్వయ కర్త మైలేరి మల్లయ్య, బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, సంఘం నాయకులు అర్తిగారి నరసింహులు, చిన్న వెంకట సుబ్బయ్య, గుత్తి నరసింహులు, పాంపల్లె మద్దిలేటి, రాందాసు, ఉల్లి వెంకట సుబ్బయ్య, కొల్లం పుల్లయ్య, సిద్ది నారాయణ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని బలిజ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు నడిపి వెంకట



ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న బలిజ సంఘం నాయకులు

సుబ్బయ్య, నాయకులు జింకా వెంకటస్వామి, ఆకుల చిన్నసుబ్బయ్య, ఎ.నరసింహులు, కొండయ్య, సుబ్బరామయ్య తదితరులున్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంకాలమ్మ గుడి ఆవరణలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సిద్ది సత్యనారాయణ, సిద్దినారాయణ, సహకార సంఘ ప్రెసిడెంట్ సత్యం, నీలి రామారావు, జంగిటి మల్లికార్జున, తోట సంజీవ, నాయనగారి కృష్ణుడు, కొత్త వెంకటేశ్వర్లు, గాంధీ వెంకటసుబ్బయ్య, జిల్లా సుబ్బన్న, పగడాల రమేష్‌బాబు తదితరులున్నారు.